క్లుప్తంగా

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు



అయిజ: పట్టణ సమీపంలోని స్వయంభు కట్ట కింద తిమ్మప్ప స్వామి ఆలయంలో ఆదివారం నుంచి నవరాత్రి బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. ఈనెల 15 నుంచి 23 వరకు తొమ్మిదిరోజులపాటు బ్రహ్మోత్సవాలు నిర్వహించేందుకు ఆలయ కమిటీ వారు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. వాహన సేవలో భాగంగా ప్రతిరోజు ఒక వాహనంపై శ్రీదేవి, భూదేవి సమేతంగా వేంకటేశ్వరస్వామివారి ఉత్స విగ్రహాలను ఊరేగించనున్నారు. ప్రతిరోజు భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు, భోజన వసతి కల్పిస్తున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది.

శిక్షణ తరగతులను జయప్రదం చేయండి



గద్వాల అర్బన్: ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఈనెల 16నుంచి 20వ తేదీ వరకు హన్మకొండలో జరగనున్న విద్య, వైజ్ఞానిక రాజకీయ శిక్షణ తరగతులను విద్యార్థులు అధిక సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరి ప్రవీణ్‌కుమార్ పిలుపునిచ్చారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఏఐఎస్ఎఫ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో నాయకులు హనుమేష్, స్వామి, కాశీం ఉన్నారు.

బీచుపల్లిని సందర్శించిన కొల్లాపూర్ ఎమ్మెల్యే



ఎర్రవల్లిచౌరస్తా: ఎర్రవల్లి మండలంలోని బీచుపల్లి ఆంజనేయస్వామి ఆలయాన్ని శనివారం కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ఆంజనేయస్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అంతకు ముందు ఆలయ సంప్రదాయం ప్రకారం ఆలయ ప్రధాన అర్చకులు పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆలయ ఈఓ రామన్‌గౌడ్ ఆయనకు శేషవస్త్రాలతో సత్కరించి తీర్థ ప్రసాదాలను అందించారు.

ఆదిశిలా క్షేత్రంలో హరికథ



మల్దకల్: ఆదిశిలా క్షేత్రమైన స్వయంభూ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ఆంజనేయులు భగవతార్ వేంకటేశ్వరస్వామి చరిత్రను భక్తులకు హరికథ రూపంలో వినిపించారు. ఈ హరికథ కార్యక్రమాన్ని తిలకించేందుకు భక్తులు హాజరయ్యారు. కార్యక్రమంలో హార్మోనిస్టు, తబలిస్టు, సిబ్బంది పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ

ఎర్రవల్లిచౌరస్తా: మండల కేంద్రంలో ఇటిక్యాల ఎస్ఐ అశోక్‌బాబు ఆధ్వర్యంలో శనివారం పోలీస్ సిబ్బంది ముమ్మరంగా వాహనాల తనిఖీ నిర్వహించారు. హైదరాబాద్, కర్నూల్ వైపు నుంచి గద్వాల వైపు, రాయచూర్, గద్వాల ప్రాంతాల నుంచి హైదరాబాద్ వైపు వెళ్లే వాహనాలను తనిఖీ చేసి క్షుణ్ణంగా పరిశీలించారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ఎలాంటి పత్రాలు లేకుండా రూ.50 వేల నగదు కంటే ఎక్కువ మొత్తంలో తరలించి పట్టుబడినా, లేదా అక్రమంగా మద్యాన్ని తరలించినా చట్ట రిత్యా చర్యలు తప్పవని ఎస్ఐ పేర్కొన్నారు.

ఆరేళ్లుగా.. నత్తనడకనే!

- ముందుకు సాగని సబ్‌స్టేషన్ పనులు
- కరెంట్ కష్టాలు తీరుతాయని ప్రజల నిరీక్షణ

రాజోళి: మూడు గ్రామాలకు విద్యుత్‌ను అందించేందుకు నిర్మించ తలపెట్టిన సబ్ స్టేషన్ నిర్మాణం ఆరేళ్లుగా నత్తనడకనే కొనసాగుతోంది. ఆగుతూ, సాగుతూ పనులు పూర్తి చేసుకోలేక, మూడు గ్రామాల ప్రజలు ఆశలు వదులుకుంటున్నారు. మండలంలోని పచ్చర్ల గ్రామంలో నిర్మిస్తున్న 33/11కేవీ సబ్ స్టేషన్ పనులు ఇంతవరకు పూర్తి కాకపోవడంతో మండల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సబ్ స్టేషన్ నిర్మాణంతో విద్యుత్ అంతరాయం తగ్గుతుందని, వ్యవసాయ పనులకు అడ్డంకులు లేకుండా నిరంతర కరెంట్ సరఫరా అవుతుందనుకున్నారు. అధికారులు, నాయకులు దాని పనులు పూర్తి చేయకపోగా, కన్నెత్తి చూడడం మానేశారని ప్రజలు పేర్కొంటున్నారు.

మూడు గ్రామాలకు విద్యుత్ సరఫరా చేసేందుకు పచ్చర్లలో నిర్మిస్తున్న సబ్‌స్టేషన్ ద్వారా పచ్చర్ల, తనగల, తుమ్మిళ్ల గ్రామాలకు మూడు ఫీడర్ల ద్వారా ప్రణాళిక రూపొందించారు. దాని కోసం గ్రామస్తుల తీర్మానంతో స్థానికంగా ఉన్న సర్వే నెంబర్ 24 నుంచి ఎకరా భూమిని కేటాయించారు. పనులు మందకొడిగా సాగతుండడంతో రైతుల్లో, ప్రజల్లో తీవ్ర నైరాశ్యం నెలకొంది. సబ్‌స్టేషన్ నిర్మాణానికి 2017 అక్టోబర్ 22న అప్పటి మంత్రి జూపల్లి కృష్ణారావు భూమి పూజ చేశారు. పచ్చర్ల, తుమ్మిళ్ల, తనగల గ్రామాలకు మూడు ఫీడర్ల ద్వారా కరెంట్ సరఫరా చేస్తామని చెప్పడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. కానీ నేటి వరకు పనులు పూర్తి కాకపోవడంతో తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు.



పచ్చర్లలో పూర్తికాని 33/11కేవీ సబ్ స్టేషన్



వృథాగా పడిఉన్న విద్యుత్ పరికరాలు

కొద్ది నెలల తర్వాత విద్యుత్ స్తంభాలు, మెటీరియల్ తీసుకొచ్చారు. మిషన్ భగీరథ పనుల వల్ల పనులు ముందుకు సాగడం లేదని సాకులు చెప్పి అధికారులు పనుల్లో కదలికను వదిలేశారు. ఇలా ఎన్నో సాకులతో అధికారులు సబ్‌స్టేషన్ నిర్మాణం ఏళ్లు గడుస్తున్నా పూర్తి చేయలేకపోతున్నారు. ప్రతి ఏటా సబ్ స్టేషన్ నుంచి కరెంటు అందుతుందని ఆశించిన రైతులకు, ప్రజలకు ఏళ్ల తరబడి నిరాశే మిగులుతోంది. ప్రస్తుతం మెటీరియల్ అందుబాటులో లేకపోవడంతోనే పనులు నిలిచాయని వాదనలు వినిపిస్తున్నాయి.

సబ్‌స్టేషన్ కోసం ఎదురు చూస్తున్నాం..



పచ్చర్ల గ్రామంలో నిర్మిస్తున్న సబ్ స్టేషన్‌కు భూమి పూజ చేసి ఆరేళ్లు గడిచింది. కానీ ఇంతవరకు పనులు పూర్తి చేయలేదు. 33/11కేవీ సబ్‌స్టేషన్ పూర్తి చేస్తే గ్రామాల్లో కరెంట్ కష్టాలకు చెక్ పడుతుందనుకున్నాం. నేటి వరకు పూర్తి కాకపోవడం బాధాకరం. ఇప్పటికైనా అధికారులు, నాయకులు దీనిపై చర్యలు తీసుకుని పనులు త్వరగా పూర్తి చేయాలి.

– నాగరాజు, పచ్చర్ల

అధికారులకు తెలియజేస్తాం..

గతంలో ఉన్న అధికారుల పర్యవేక్షణలో సబ్‌స్టేషన్ పనులు జరిగాయి. ప్రస్తుతం నేను రాజోళి మండలానికి కొత్తగా బాధ్యతలు తీసుకున్నాను. దీనికి సంబంధించిన పూర్తి వివరాలను పై అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకుంటాం.

– సందీప్, ఏఈ, రాజోళి

టీఎస్‌పీఎస్సీని రద్దు చేయాలి



నిరసన వ్యక్తం చేస్తున్న అఖిల పక్షం నాయకులు

గద్వాల అర్బన్: టీఎస్‌పీఎస్సీని రద్దు చేసి, నూతన బోర్డు ఏర్పాటు చేయాలని టీజేఎస్ జిల్లా అధ్యక్షుడు అలూరు ప్రకాష్‌గౌడ్, వైఎస్సార్‌టీపీ కో ఆర్డినేటర్ అతిఖుర్ రహ్మాన్, సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకటస్వామి, సీపీఐ జిల్లా కార్యదర్శి ఆంజనేయులు డిమాండ్ చేశారు. ఈ మేరకు అఖిల పక్షం ఆధ్వర్యంలో శనివారం జిల్లా కేంద్రంలోని పాతబస్టాండులో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లక్షలాది మంది నిరుద్యోగులు రూ.వేలల్లో వెచ్చించి పోటీ పరీక్షలకు కోచింగ్ తీసుకున్నారన్నారు. టీఎస్‌పీఎస్సీ తప్పిదాల వల్ల పరీక్షలు రద్దు కావడంతో నిరుద్యోగులకు తీవ్ర నష్టం జరిగిందన్నారు. దీనికి టీఎస్‌పీఎస్సీ బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. వెంటనే టీఎస్‌పీఎస్సీని ప్రక్షాళన చేయాలని, నిబంధనల ప్రకారం కొత్త బోర్డు ఏర్పాటు చేయాలని, నిరుద్యోగులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతాంగ సమితి రాష్ట్ర నాయకుడు గోపాల్, వీవీ నర్సింహ, విద్యార్థి యువజన నాయకులు మహబూబ్‌బాషా, గోపాల్, వీరభద్రప్ప, మధు, రాజు ఉన్నారు.

ఆదిశిలా క్షేత్రంలో అమావాస్య పూజలు



పెద్ద చింతరేవుల శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో భక్తుల రద్దీ

మల్దకల్: ఆదిశిలా క్షేత్రమైన స్వయంభూ లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం భక్తులు అమావాస్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా అర్చకులు మధుసూదనాచారి, రవిచారి స్వామివారికి అభిషేకాలు నిర్వహించారు. సద్దలోనిపల్లి కృష్ణస్వామి, పాల్వాయి అడవిఆంజనేయస్వామి, కుర్తిరావులచెర్వు గట్టుతిమ్మప్పస్వామి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గద్వాల పట్టణంలోని ప్రైవేట్ పాఠశాల యజమాన్యం ఆదిశిలా క్షేత్రంలో అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో అరవిందరావు, చంద్రశేఖర్‌రావు, చంద్రశేఖర్‌రెడ్డి, నరేందర్ పాల్గొన్నారు.

మానవపాడు: మండలంలోని ఆయా గ్రామాల్లోని ఆలయాల్లో అమావాస్య పూజలు నిర్వహించారు. మానవపాడు, నారాయణపురం, కలుకుంట్ల, చెన్నిపాడు గ్రామాల ఆలయాల్లో ఆకుపూజ నిర్వహించారు. కుంకుమార్చన, ప్రత్యేకపూజలు, అభిషేకాలు నిర్వహించారు.

గట్టు: మండల కేంద్రంలోని గండి ఆంజనేయస్వామి ఆలయంలో అమావాస్య సందర్భంగా ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు దేవాలయం దగ్గర భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. మాచర్ల గ్రామంలోని చెన్నకేశవస్వామి ఆలయంలో స్వామికి పూజలు నిర్వహించారు.



ఆదిశిలా క్షేత్రంలో పూజలు చేస్తున్న భక్తులు

గద్వాల రూరల్: ధరూరు మండలంలోని ఆయా గ్రామాల్లోని ప్రధాన ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. మండల కేంద్రంలోని ఆంజనేయ స్వామి ఆలయం, పెద్ద చింతరేవుల ఆంజనేయ స్వామి ఆలయం, అల్వలపాడు తెలుగోనిపల్లి ఆంజనేయ స్వామి, కోతులగిద్ద అరణ్లేశ్వర స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

గద్వాలలో 'కోడ్' కూయలేదా?




పట్టణంలో ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ విగ్రహాలు

గద్వాల రూరల్: రాష్ట్ర శాసన సభ ఎన్నికలకు సంబంధించి ఈ నెల 9తేదీన కేంద్ర ఎన్నికల సంఘం ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేసింది. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా 9వ తేదీ నుంచి ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. రాజకీయ పార్టీలకు సంబంధించిన ఫ్లెక్సీలు, పోస్టర్లు ఇతర ప్రచార హోర్డింగ్‌లను 48గంటల వ్యవధిలో తొలగించాలని ఆదేశించింది. తొలగించని పార్టీలపై ఎన్నికల కోడ్ నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటామని ఆదేశాలు సైతం జారీ చేసింది. జిల్లా కేంద్రంలోని పాత బస్టాండులో ఉన్న కాంగ్రెస్ పార్టీ మాజీ ప్రధానులైన దివంగత నేతలు ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ విగ్రహాలు, మాజీ ముఖ్యమంత్రి దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలకు ఎన్నికల కోడ్ ప్రకారం ముసుగులు వేయాల్సి ఉంది. కానీ కోడ్ అమల్లోకి వచ్చి 6రోజులవుతున్నా ఆ దిశగా అధికారులు చర్యలు చేపట్టకపోవడం గమనార్హం.


'అబ్రహం'కే బీఫాం ఇవ్వాలి

- లేకుంటే మూకుమ్మడిగా రాజీనామా చేస్తాం
- ఎమ్మెల్యే వర్గీయుల వెల్లడి

శాంతినగర్: అలంపూర్ సిట్టింగ్ ఎమ్మెల్యే అబ్రహంకే బీఫాం ఇవ్వాలని ఆయన అనుచరులు, ప్రజాప్రతినిధులు డిమాండ్ చేశారు. వడ్డేపల్లి పుర పరిధిలోని శాంతినగర్ భవాని ఫంక్షన్ హాల్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. ఎవరు ఎన్ని కుట్రలు పన్నినా సీఎం కేసీఆర్ ప్రకటించిన అభ్యర్థులకు బీఫాం ఇస్తారనే నమ్మకం తమకుందన్నారు. సీఎం నమ్మకాన్ని వమ్ము చేయకుండా అబ్రహంను భారీ మెజార్టీతో గెలిపిస్తామన్నారు. ఆయనకు టికెట్ ఇవ్వని పక్షంలో అందరం మూకుమ్మడిగా రాజీనామా చేయనున్నట్లు వెల్లడించారు. అనంతరం అబ్రహంకు మద్దతుగా ఏకగ్రీవ తీర్మానం చేశారు. సమావేశంలో వివిధ మండలాలకు చెందిన జెడ్పీటీసీ సభ్యులు, వివిధ శాఖల చైర్మన్లు, ఎంపీపీలు, సర్పంచులు, ఎంపీటీసీలు, కౌన్సిలర్లు, కో ఆప్షన్ మెంబర్లు, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



అబ్రహంకు బీఫాంఇవ్వాలని నినదిస్తున్న బీఆర్ఎస్ నాయకులు



మాట్లాడుతున్న ప్రజాప్రతినిధులు

ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు సురక్షితం

మల్దకల్: ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు సురక్షితమని డాక్టర్ స్వరూపరాణి సూచించారు. శనివారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వివిధ గ్రామాల నుంచి వచ్చిన గర్భిణీ, బాలింతలకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ గర్భిణీలు నెలనెలా క్రమం తప్పకుండా వైద్యపరీక్షలు చేయించుకోవడంతో పాటు పోషకాలు ఎక్కువగా ఉండే పౌష్టికాహారాన్ని తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెల్త్‌సూపర్‌వైజర్ శ్రీధర్, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

మద్యం తాగుతున్న వ్యక్తులు అరెస్ట్



అలంపూర్: బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్న ఇద్దరు వ్యక్తులను ఎక్సైజ్ సీఐ హనుమనాయక్ తెలిపారు. అలంపూర్ చౌరస్తా సమీపంలోని 44వ జాతీయ రహదారిపై పుల్లూరు టోల్ ప్లాజా వద్ద ఏర్పాటు చేసిన సరిహద్దు చెక్‌పోస్టును ఎక్సైజ్ సీఐ హనుమ నాయక్, ఎస్ఐలు హ రిక్రిష్ణ, అనంత రెడ్డి సిబ్బందితో కలి సి శనివారం సందర్శించారు. ఈ క్రమంలో టోల్‌ప్లాజా సమీపంలో బహిరంగ ప్రదేశంలో మద్యం తాగుతున్న పుల్లూరు గ్రామానికి చెందిన రాముడు, నరేష్‌లను అరెస్టు చేసి నట్లు తెలిపారు.

'కాల్వలో పూడిక తీయండి'

మానవపాడు: ఆర్డీఎస్ కాల్వ పూడికతీతకు, మరమ్మత్తులకు రూ.కోట్లు మంజూరైనా అధికారుల నిర్లక్ష్యం వల్ల పనులు అసంపూర్తిగా ఉన్నాయి. చివరి ఆయకట్టు రైతులకు నీరు అందక తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఆర్డీఎస్ డీ-29, డీ-30 కాలువల్లో పిచ్చి మొక్కలు, ముళ్ల పొదలు దర్శనమిస్తున్నాయి. కాలువ నీరు చివరి పొలాలకు రావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోని పూడికతీత పనులు చేసి నీరు అందించాలని రైతులు కోరుతున్నారు.

ఏఐసీసీ కార్యదర్శి గృహ నిర్బంధం



శాంతినగర్: ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్‌ను శాంతినగర్ పోలీసులు ముందస్తుగా హౌస్ అరెస్ట్ చేశారు. నేషనల్ హైవే పుల్లూరు టోల్ ప్లాజా వద్ద శనివారం అఖిల పక్షం ఆధ్వర్యంలో చేపట్టిన సడక్ బంద్ కార్యక్రమానికి ఆయన వెళ్తున్నారనే సమాచారంతో శాంతినగర్ క్యాంపు కార్యాలయానికి చేరుకున్న పోలీసులు గృహ నిర్బంధం చేశారు. సడక్ బంద్ కార్యక్రమానికి వెళ్లకుండా అడ్డుకున్నారు.

వాగుపై వంతెన నిర్మించండి

అయిజ: మండలంలోని సింధనూర్ వద్ద వాగుపై వంతెన నిర్మించక పోవడంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. వివిధ గ్రామాల నుంచి మండల కేంద్రానికి ప్రతిరోజు ప్రయాణం చేస్తుంటారు. వంతెన నిర్మించకుండా కొన్ని సంవత్సరాల క్రితం సీసీ బెడ్డు నిర్మాణం చేపట్టారు. వర్షాకాలంలో ఎరువులు, పురుగు మందులు కొనేందుకు ప్రతిరోజు రైతులు ఎద్దులబండ్లు, ఆటోల్లో ప్రయాణం చేయాల్సి ఉంటుంది. వరద నీరు వాగులో వేసిన సీసీ బెడ్డుపై ప్రవహించినంతసేపు ఆప్రదేశంలో ప్రయాణానికి ఆటంకం ఏర్పడుతుంది. ఆ సమయంలో ప్రజలు గమ్యానికి చేరేందుకు ఇబ్బందులు ఏర్పడతాయి. సంబంధిత అధికారులు స్పందించి వంతెన నిర్మిస్తే ప్రజల ప్రయాణ ఇబ్బందులు తొలగుతాయి.

రాష్ట్రంలో నియంత పాలన

కేటీదొడ్డి: రాష్ట్రంలో నియంత పాలన కొనసాగుతోందని జెడ్పీ చైర్‌పర్సన్ సరిత అన్నారు. మండలంలోని ఉమిత్యాలతండా, రంగాపురం గ్రామంలోని శ శనివారం 'తిరగబడుదాం, తరమికొడదాం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ఇంటింటికి తిరుగుతూ సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని, రాబోయే ఎన్నికలలో గెలిపించుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిక

గద్వాల రూరల్: ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో బీఆర్ఎస్ పార్టీ విఫలం కావడంతో గట్టు మండలానికి చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు జెడ్పీ చైర్‌పర్సన్ సరిత అన్నారు. ఈ మేరకు ఆమె శనివారం తన క్యాంపు కార్యాలయంలో గట్టు మండలం గొర్లఖాన్‌దొడ్డి గ్రామానికి చెందిన పలువురు పార్టీలో చేరగా వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కృష్ణారెడ్డి, తిరుపతయ్య, గుండన్న, తిమ్మప్ప పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ సరిత

మహిళల సాధికారతపై అవగాహన

అలంపూర్‌రూరల్: హైదరాబాద్ వజీర్ సుల్తాన్ టోబోకో కంపెనీ వారు సాంఘీక బాధ్యత పథకం ద్వారా తెలంగాణ వర్తక సమాఖ్య వారు మహిళా సాధికారిక కార్యక్రమం శనివారం అలంపూర్‌లో నిర్వహించారు. కార్యక్రమాన్ని తెలంగాణ వాణిజ్య సమాఖ్య అధ్యక్షుడు మీలాజయదేవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా అలంపూర్, ఇటిక్యాల, ఉండవెల్లి, వడ్డేపల్లి, రాజోళి, మానవపాడు, అయిజ మండలాల మహిళలకు, ఆశా వర్కర్లకు ప్రోత్సాహిక అభివృద్ధి మరియు మహిళలు వ్యాపార అవకాశాలు అందిపుచ్చుకునేలా వివిధ అంశాలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో అలంపూర్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ జయచంద్రారెడ్డి పాల్గొన్నారు.



మహిళలకు అవగాహన కార్యక్రమం

మద్దిలేటి ఆశయ సాధనకు పోరాడుదాం



మద్దిలేటి స్థూపంం వద్ద నివాళులర్పిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

గద్వాల అర్బన్: ప్రజాస్వామిక తెలంగాణ ఏర్పాటే లక్ష్యంగా అమరుడు మద్దిలేటి స్ఫూర్తితో పోరాటం సాగించాలని టీపీఎఫ్ రాష్ట్ర కో కన్వీనర్ ప్రభాకర్, తెలంగాణ రైతాంగ సమితి రాష్ట్ర అధ్యక్షుడు జక్కుల వెంకటయ్య అన్నారు. శనివారం మద్దిలేటి 9వ వర్ధంతి సందర్భంగా జిల్లా కేంద్రంలోని రెండో రైల్వేగేటు సమీపంలోని మద్దిలేటి స్థూపం వద్ద ప్రజాసంఘాల నాయకులు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్దిలేటి తెలంగాణ మలిదశ ఉద్యమంలో కీలకంగా పని చేశారని, ప్రజాస్వామిక తెలంగాణ కావాలని ఆనాడే పెద్ద ఎత్తున్న పోరాటం చేశారన్నారు. కార్యక్రమంలో తెలంగాణ రైతాంగ సమితి రాష్ట్ర నాయకుడు గోపాల్, పౌరహక్కుల సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు సుభాన్, కేఎన్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు రవికుమార్, మద్దిలేటి కుమార్తె లలిత ఉన్నారు.

రైతు భరోసా సభ వాల్‌పోస్టర్ విడుదల

ఎర్రవల్లిచౌరస్తా: ఈ నెల 18న మానవపాడు మండల కేంద్రంలో రైతుల సమస్యల పరిష్కారం కోసం బీఎస్పీ ఆధ్వర్యంలో చేపట్టే రైతు భరోసా సభను విజవంతం చేయాలని బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షుడు తిరుపాల్ అన్నారు. శనివారం ఎర్రవల్లి మండలంలోని షేకుపల్లి, సాసనూలు, ధర్మవరం, వల్లూరు గ్రామాలను బీఎస్పీ నాయకులతో కలిసి ఆయన సందర్శించారు. అనంతరం వాల్ పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో నాయకులు రాముడు, రవికుమార్, మదు, పరుశ రాముడు, రవి, పరుశ, చందు, రాజు, కార్యకర్తలు ఉన్నారు.



వాల్‌పోస్టర్లు విడుదల చేస్తున్న నాయకులు

కాంగ్రెస్ నాయకుల ప్రత్యేక పూజలు

ఎర్రవల్లిచౌరస్తా: ఎర్రవల్లి మండలంలోని బీచుపల్లి ఆంజనేయస్వామికి శనివారం మండల కాంగ్రెస్ నాయకులు ప్రత్యేక పూజలు చేసి 101 కొబ్బరికాయలు కొట్టారు. ఈ సందర్భంగా వచ్చే శాసన సభ ఎన్నికల్లో మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ అలంపూర్ నియోజకవర్గం నుంచి భారీ మెజార్టీతో గెలవాలని కోరుకుంటూ ధ్వజస్తంభం ముందు కొబ్బరికాయలు కొట్టారు. పేదల కోసం కాంగ్రెస్ పార్టీ హయాంలోనే అభివృద్ధి సాధ్యమన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేష్, రాజ్‌కుమార్, మద్దిలేటి, ఉమాపతి, జాకర్, ప్రభాకర్, సంపత్‌కుమార్, శేఖర్, లక్ష్మన్న, విజయ్, ప్రదీప్, తదితరులు ఉన్నారు.



కొబ్బరికాయలు కొడుతున్న నాయకులు

దేవీ శరన్నవరాత్రులకు ఆలయాల ముస్తాబు



ముస్తాబైన ధరూరులోని కాళికాదేవి ఆలయం



కాళికాదేవి అమ్మవారు



శాంతినగర్‌లో..

గద్వాల రూరల్: దేవీ శరన్నవరాత్రుల ఉత్సవాలకు ధరూరు మండల కేంద్రంలోని కాళికాదేవి ఆలయం ముస్తాబైంది. ఏటా జరిగే ఈ ఉత్సాలవాలకు మండలంలో ఆయా గ్రామాల్లోని ఆలయాలను ముస్తాబు చేస్తారు. మండల కేంద్రంలోని కాళికాదేవి ఆలయంలో జరిగే పూజా కార్యక్రమాలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ధర్మకర్త కాళిదాసు, అర్చకులు కిష్టాచార్యులు తెలిపారు.

అయిజ: పట్టణంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఆదివారం నుంచి తొమ్మి ది రోజుల పాటు దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. 15వ తేదీ నుంచి 23వ తేదీ వరకు ఉత్సవాలు నిర్వహిస్తారు. ఉదయం గణపతి పూజ, పుణ్యాహవచనం, ఋత్విగ్వరణం, గోపూజ, కలశ స్థాపన, మండప ఆరాధనం, కుంకుమార్చన, అమ్మవారి ఉత్సవ విగ్రహానికి పంచామృతాభిషేక, అలంకరణ, నవగ్రహ పూజ, మంగళ హారతి, ఆశీర్వచనం, అన్న ప్రసాదం, తీర్థప్రసాదాల వితరణ నిర్వహిస్తున్నట్లు అర్చకులు పేర్కొన్నారు. సాయంత్రం పంచసూక్త పారాయణం, ప్రదోష పూజ, కుంకుమార్చన, కుమారి పూజ, బతుకమ్మ సంబరాలు, పెద్ద పూజ, చిన్న పూజ, మహా మంగళహారతి, మంత్ర పుష్పం, తీర్థ ప్రసాద వితరణ ఉంటుందని ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

శాంతినగర్: వడ్డేపల్లి పుర పరిధిలోని శాంతినగర్ వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆదివారం నుంచి దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయకమిటీ అధ్యక్షుడు రావూరి సురేష్‌కుమార్ తెలిపారు.

అమ్మవారి అలంకరణలు

ఆదివారం బాల త్రిపుర సుందరీదేవి, సోమవారం వేదమాత గాయత్రీదేవి. మంగళవారం అన్నపూర్ణాదేవి, బుధవారం లలితాంబికాదేవి, గురువారం మహాలక్ష్మీదేవి, శుక్రవారం మహా సరస్వతిదేవి, శనివారం మహిశాసురమర్ధనిదేవి, ఆదివారం మహాదుర్గాదేవి, సోమవారం శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి దేవిగా అమ్మవారు పూజలందుకుంటారని ఆలయ కమిటీ సభ్యులు వివరించారు.